నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 24 జనవరి 2025 | SIDDIPET


కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

చిన్నకోడూరు, జనవరి 23: కేసీఆర్, హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించకుంటే ఇవాళ రైతులకు సాగునీరు వచ్చేదా అని సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మెట్టుపల్లి, సలెంద్రి గ్రామాల రైతులు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. మెట్టుపల్లి, సలెంద్రి రైతులకు సాగునీరు అందడంతో గురువారం సంతోషం వ్యక్తం చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో సాగునీరు ఇవ్వడంతో తామంతా బంగారు పంటలు పండించుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, వినయ్‌రెడ్డి, శంకర్, మొండయ్య, కుమార్, రామచంద్రం, బాలమల్లుగౌడ్, రాజయ్య, కొత్త ఎల్లయ్య, చంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, కిట్టు, వినిత్, కృతిక్, సంజీవ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

కేంద్రమంత్రి గడ్కరీకి హరీశ్‌రావు లేఖ

నంగునూరు, జనవరి 23: సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారిలో భాగంగా నంగునూరు మండలం రాజగోపాల్‌పేట వద్ద సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్‌తో కూడిన డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులు ముమ్మరంగా చేపడుతున్నందుకు కేంద్ర మంత్రికి హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. రాజగోపాల్‌పేట పరిధిలో రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని, పాదచారులు సౌకర్యార్థం సెంట్రల్ లైటింగ్, డ్రైనేజ్ లేకపోవడం ఏర్పాటు చేయాలని కోరారు. డ్రైనేజీ నిర్మాణంతో రోడ్డు మీదకు నీళ్లు రాకుండా వాహనాల రాకపోకలు సజావుగా సాగుతాయని చెప్పారు. కిలోమీటర్ పరిధిలో సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్ కూడిన డ్రైనేజ్ నిర్మాణం చేపట్టాలని లేఖలో హరీశ్‌రావు కోరారు.

కాంగ్రెసోళ్లకే పథకాలు మంజూరు

గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 23: ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నది తప్పా అర్హులకు కాదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆర్భాటంగా చేపడుతున్న గ్రామసభలతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రజలు చైతన్యవంతులై అధికారులను ప్రశ్నిస్తుంటే, పోలీస్ పహారా మధ్య సభలు నిర్వహిస్తున్నారని, అనర్హుల జాబితాపై ప్రశ్నించే ప్రయత్నం చేస్తుంటే అధికార పార్టీ నాయకులు కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. రుణమాఫీ, పింఛన్లు, ఇండ్లు, ఆరు గ్యారెంటీలు, హామీలపై ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని వారికే ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలువాలనే ఉద్దేశంతోనే గ్రామసభలు నిర్వహిస్తున్నారని, కానీ.. వారికి భంగపాటు తప్పదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పార్టీలకతీతంగా పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న గ్రామసభలకు సీఎం, మంత్రులు ఎక్కడా హాజరు కావడం లేదని, ఎమ్మెల్యేలు హాజరైనా ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా నిరసనలు ఎదురవుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల్లో భూమిలేని వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, ఓటు అడగాలంటే ముందుగా అర్హులకే సంక్షేమ పథకాలను అమలు చేయలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ జడ్పీటీసీ మల్లేశం, రాణీసత్యనారాయణగౌడ్, పార్టీ అధ్యక్షుడు మధు, నవాజ్, కౌన్సిలర్లు రజిత, శ్యామల, కిషన్‌రెడ్డి, మెట్టయ్య, శ్రీనివాస్, కనకయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, జాఫర్‌ఖాన్, నర్సింగరావు, హన్మంతరెడ్డి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 23: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని, జాబితాల్లో పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీలో త్వరలోనే 3వేల ఉద్యోగాల నియామకం చేపడతామని తెలిపారు. గురువారం హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.2కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనులను ఆయన ప్రారంభించారు. అంతకుముందు పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అనితారెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ శివయ్య, పాల్గొన్నారు.


మద్దూరు: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం సలాఖపూర్‌లో ప్రభుత్వ పథకాల మంజూరుపై అధికారులు స్పష్టత ఇవ్వక పోవడంతో గ్రామసభను బహిష్కరించి నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

మూడోరోజూ అదేతీరు

అధికారులకు తప్పని నిరసనలు, నిలదీతలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడోరోజూ గురువారం ప్రజాపాలన గ్రామసభలు అట్టుడికాయి. అధికారులకు ప్రజల నుంచి నిరసనలు, నిలదీతలు తప్పలేదు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి, ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెసోళ్లకు కేటాయించారని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రశ్నల వర్షం కురిపించారు. రైతుభరోసా, పింఛన్లు, పథకాలపై అధికారులను నిలదీశారు. పలుచోట్ల ప్రొటోకాల్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫొటో గ్రామసభల ఫ్లెక్సీలో పెట్టక పోవడంపై గజ్వేల్ మండలంలో ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించారు.

- ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌వర్క్, జనవరి 23

చేగుంట గ్రామసభలో తమ పేర్లు రాలేదని ఆందోళన చేస్తున్న మహిళలు

వెల్దుర్తి: మాసాయిపేటలో సంక్షేమ పథకాలు అందడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళ

శివ్వంపేట: గోమారంలో అధికారులు వెళ్లిపోవడంతో వెనుదిరుగుతున్న మహిళలు


కోహీర్: వెంకటాపూర్ గ్రామంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

హత్నూర: హత్నూర గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

జగదేవపూర్‌లో గొడవ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

శేఖాపూర్ తండాలో పవర్ పాలిటిక్స్

జహీరాబాద్, జనవరి 23 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం శేఖాపూర్ తండాలో గురువారం అధికార పార్టీ నాయకుడి ఇంటి ఆవరణలో ప్రజాపాలన గ్రామసభను ఏర్పాటు చేయడంతో తండావాసులతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు వ్యతిరేకించారు. మండల అధికారులు సైతం గ్రామ పంచాయతీలో గ్రామ సభను నిర్వహిస్తామని చెప్పడంతో అధికార పార్టీ నాయకులు వీరంగం సృష్టించారు. తాము ఏర్పాటు చేసిన గ్రామ సభ వేదిక వద్దకు అధికారులు రావాలని అధికార పార్టీ నాయకులు పట్టుబట్టారు. దీనికి తహసీల్దార్, గ్రామ ప్రజాపాలన ప్రత్యేకాధికారి రవీందర్ ససేమిరా అనడంతో అధికార పార్టీ నేతల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తండాలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో గ్రామసభను వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. గ్రామసభ వాయిదా వేయవద్దని అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అధికారులు జహీరాబాద్ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే జహీరాబాద్ రూరల్ ఎస్సై ప్రసాద్‌రావు తన సిబ్బందితో తండాకు చేరుకున్నారు. పోలీసుల జోక్యం చేసుకుని నాయకులకు నచ్చజెప్పి తిరిగి తండాలో గ్రామసభను నిర్వహించారు. అనంతరం పలు పథకాల లబ్ధిదారుల వివరాలను అధికారులు వెల్లడించారు. కాగా, ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు సభకు హాజరు కాలేదు.


కౌడిపల్లి: ఇందిరమ్మ ఇండ్ల కమిటీని రద్దు చేయాలంటూ కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇస్తున్న వెల్మకన్న గ్రామస్తులు

మెదక్ రూరల్: మక్త భూపతిపూర్‌లో మధ్యలోనే అధికారులు వెళ్లిపోవడంతో గ్రామసభ నుంచి వెనుదిరిగి వెళ్తున్న గ్రామస్తులు

పోలీసుల సంక్షేమమే ధ్యేయం

- డీజీపీ డాక్టర్ జితేందర్
- మెదక్ ఎస్పీ కార్యాలయంలో సెల్యూట్ బేస్ ప్రాంగణం ప్రారంభం

మెదక్‌లో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

మెదక్, జనవరి 23(నమస్తే తెలంగాణ): పోలీసుల సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా మీకోసం నేనున్నానని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. గురువారం మెదక్ డిస్ట్రిక్ట్ పోలీస్ ఆఫీస్‌లో కవాతు ప్రాంగణం, సెల్యూట్ బేస్‌ను ఆయన ఆవిష్కరించారు. డీజీపీకి మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. పోలీస్ కవాతులో పాల్గొన్న డీజీపీ గౌరవ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పోలీసులు పనిచేస్తున్నట్లు తెలిపారు. మెదక్ జిల్లాకు పరేడ్ గ్రౌండ్ రావడం శుభసూచకం అన్నారు. పోలీసులు క్రమశిక్షణతో పాటు శారీరక దృఢత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సరెండర్ లివుల బిల్లుల కోసం రూ.200 కోట్లు, ఆరోగ్య భద్రత కోసం రూ.75కోట్లు ప్రభుత్వం రిలీజ్ చేసిందన్నారు. అమీన్‌పూర్, రాయపోల్, చేగుంట, నార్సింగి మండల కేంద్రాల్లో కొత్త బిల్డింగుల మంజూరు, ఇతర కొత్త మండల కేంద్రాల్లో పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నక్సల్స్ సమస్య, నార్కోటిక్ డ్రగ్స్ మీద ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసులు త్వరితగతిన ఛేదించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సైబర్ క్రైమ్‌తో రూ.180 కోట్ల రికవరీ చేశామన్నారు. 13 నెలలుగా పోలీసుల మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, యూనిఫామ్ సర్వీస్‌లో ఉండి వారి సమస్యలు చెప్పుకోలేక భయపడుతున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ తెలిపారు. మాసాయిపేట, నార్సింగి, హవేళీఘనపూర్ మండలాలకు కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, పోలీస్ ఉన్నతాధికారులు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పటాన్‌చెరు కాంగ్రెస్‌లో కయ్యం

- ఎమ్మెల్యే గూడెం క్యాంప్ కార్యాలయంపై కాటా వర్గీయుల దాడి
- కుర్చీలు ధ్వంసం.. సీఎం ఫొటో పెట్టేందుకు యత్నం
- ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నం.. అడ్డుకున్న పోలీసులు
- కాంగ్రెస్ శ్రేణులను ఎమ్మెల్యే దూరం పెడుతున్నాడని ఆగ్రహం

పటాన్‌చెరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ కార్యకర్తల వీరంగం

పటాన్‌చెరు, జనవరి 23: పటాన్‌చెరులో కాంగ్రెస్ శ్రేణులు వీరంగం సృష్టించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తూ గురువారం పటాన్‌చెరులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఆగ్రహంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చొచ్చుకుని వెళ్లి కుర్చీలను పోలీసుల సాక్షిగా నుజ్జునుజ్జు చేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించి గూడెం మహిపాల్‌రెడ్డి డౌన్ డౌన్‌తో, కాంగ్రెస్ బచావో అంటూ నినాదాలు చేశారు. గ్రూపులుగా విడిపోయి అలజడిని సృష్టించి పోలీసులకు టెన్షన్ పెట్టించారు. చివరకు పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

కొద్దిరోజులుగా గూడెంపై గుర్రు...

తమను పట్టించుకోవడం లేదని కొద్దిరోజులుగా కాంగ్రెస్ శ్రేణులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై గుర్రుగా ఉన్నారు. గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ వద్దకు అన్ని మండలాలు, మున్సిపాలిటీల నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివచ్చారు. పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశమై ఎమ్మెల్యే తీరుపై చర్చించుకుని ఆయనపై మండిపడ్డారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కేవలం బీఆర్ఎస్ నుంచి చేరిన నాయకులనే ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీని బలహీనపరుస్తున్నాడని పేర్కొన్నారు. సీఎం ఫొటో ఆయన కార్యాలయంలో పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలకు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాంగ్రెస్ శ్రేణులను పిలవడం లేదన్నారు. అన్నింట్లోను బీఆర్ఎస్ నుంచి వచ్చిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై అదిష్టానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే తీరుతో కాంగ్రెస్ పార్టీ ఉనికి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, నిరసనగా జాతీయ రహదారిపై బైఠాయిద్దామని పిలుపునిచ్చారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు జాతీయ రహదారిపై ఫ్లకార్డులతో బైఠాయించారు. గూడెం మహిపాల్‌రెడ్డి డౌన్‌డౌన్‌తో పాటు కాంగ్రెస్ బచావో అంటూ నినాదాలు చేశారు. పోలీసులు కాంగ్రెస్ నాయకులను ధర్నా విరమింపజేసేందుకు ఎంతగా ప్రయత్నించినా కార్యకర్తలు తమపట్టు వదలలేదు. పైగా కొందరు కార్యకర్తలు రోడ్డుకు మరోవైపుగా వెళ్లి ఎమ్మెల్యే గూడెం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారి వద్ద ఉన్న దిష్టిబొమ్మను లాక్కునేందుకు ప్రయత్నిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించారు. చివరికి పోలీసులు వారివద్ద నుంచి దిష్టిబొమ్మను లాక్కెళ్లి వారి ప్రయత్నం భగ్నం చేశారు. అంతలోనే ఆగ్రహంతో ఉన్న మరికొందరు నాయకులు, కార్యకర్తలు నేరుగా జాతీయ రహదారి మీదుగా ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అప్రమత్తమైన క్యాంప్ కార్యాలయ సిబ్బంది గేట్లను మూసివేయడంతో వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు మహిపాల్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ టెన్షన్ సృష్టించారు. కాంగ్రెస్ కార్యకర్తలు కొందరు గోడదూకి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలోని కుర్చీలను బయటకు పారవేశారు. మరికొందరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆఫీసులోకి దూరి సీఎం రేవంత్ చిత్రపటాన్ని అక్కడ పెట్టారు. అప్రమత్తమైన పోలీసులు క్యాంప్ ఆఫీసు రక్షణకు రంగంలో దిగి ఆగ్రహంలో ఉన్న కార్యకర్తలను బయటకు పంపించారు. బయటకు తెచ్చిన కుర్చీలను కార్యకర్తలు విరగ్గొట్టి నుజ్జునుజ్జు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల వీరంగాన్ని ఆపడం పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. పలువురు సీఐలు, ఎస్ఐలు క్యాంప్ ఆఫీసుకు తరలివచ్చి పోలీసు సిబ్బంది సాయంతో వారిని అక్కడి నుంచి పంపించివేశారు. కాంగ్రెస్ శ్రేణుల గొడవలు పటాన్‌చెరులో టెన్షన్ సృష్టించింది.

'కాటా'.. శిఖండి రాజకీయాలు మానుకో

- ప్రజలు ఛీకొట్టినా చిల్లర రాజకీయాలు చేస్తున్నవ్
- కవ్విస్తే ఊరుకునేది లేదు..
- చేతులకు గాజులు తొడుక్కోలేదు
- అభివృద్ధికి అడ్డుపడితే సహించ..
- ఘటనపై అభిష్టానం, పోలీసులకు ఫిర్యాదు చేస్తా
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆగ్రహం


పటాన్‌చెరులో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 23: అమీన్‌పూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్లిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విషయం తెలియగానే అర్ధాంతరంగా తన క్యాంప్ కార్యాలయానికి వచ్చి పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రెస్ మీట్ పెట్టి క్యాంప్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించారు. తాను చేతికి గాజులు తొడుక్కోలేదని, వచ్చినవారికి తడాఖా చూపించే శక్తి తనకు ఉందన్నారు. ఘటనపై తాను కాంగ్రెస్ అధిష్టానంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని మీడియాకు తెలిపారు. తనకు సుధీర్ఘ రాజకీయ చరిత్ర ఉందని, తాను చేతులకు గాజులు తొడుక్కోలేదని పేర్కొన్నారు. కాట శ్రీనివాస్‌గౌడ్ ప్రోద్బలంతోనే క్యాంప్ కార్యాలయంపై దాడి జరిగిందని, కాట శ్రీనివాస్‌గౌడ్ శిఖండి రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. రెండుసార్లు ప్రజలు నిన్ను తిరస్కరించిన సంగతిని మరిచి నీవే ఎమ్మెల్యేగా భావిస్తున్నావని, ప్రజలు ఛీకొట్టినా చిల్లర రాజకీయాలు చేస్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాంప్ కార్యాలయంపై దాడి సమయంలో తన అభిమానులు ఫోన్లు చేసి అడ్డుకుంటామని చెబితే తాను వద్దన్నానని తెలిపారు. అంజయ్య సీఎంగా ఉన్న సమయం నుంచి కాంగ్రెస్ రాజకీయాల్లో తాను ప్రత్యక్షంగా ఉన్నానని గుర్తుచేశారు. కేసీఆర్‌తో దిగిన ఫొటోలు కార్యాలయంలో ఉండటం తప్పేలా అవుతుందని ప్ర శ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం నాకు నచ్చిన ఫొటోలు ఆఫీసులో పెట్టుకుంటానని, దానిని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. మూర్ఖంగా ప్రతీది వ్యతిరేకించడం సబబు కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు నిరసన తెలిపినా, నా దిష్టిబొమ్మ దహనం చేసినా తాను ఏమి అనుకోనన్నారు. కానీ, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అనేది అధికారిక కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే నివాసం కూడా అని తెలిపారు. ఒక ఎమ్మెల్యే నివాసంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని పార్టీల నాయకులను తాను పిలుస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలను పార్టీ కార్యక్రమాలకు తప్పక పిలుస్తానని పేర్కొన్నారు. పటాన్‌చెరులో ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామని, ఇలా అభివృద్ధిని అడ్డుకునే సంస్కృతి లేదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.